శంభు కింకిణి నృత్యోత్సవం

మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నిర్వహించిన శంభు కింకిణి నృత్యోత్సవం సందర్శకులను ఆకట్టుకుంది. పద్మకల్యాణ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన నృత్యోత్సవాలు రెండురోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు అరుణ స్వరూప్ మండోదరి శబ్దం, ఎంత చక్కని వాడే, జావళిలను కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. డెబీజాని బసు శివస్తుతి, తీవ్రాల్, తుమ్రి, తదితరులు కథక్ నృత్యం, శోభన మిత్రదాస్ సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్ అండ్ ఉమెన్ ఉడ్ను మణిపురి, సాయి మనస్విని ఆంధ్రనాట్యంతో అలరించారు. – చందానగర్



మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

'సెర్ప్' సీఈఓ దివ్య



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

రాయదుర్గం: మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే ప్రభుత్వం లక్ష్యం అని 'సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సీఈఓ దివ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్'లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులకు నాల్గవ విడత శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వ కార్యాలయాల్లో, ఇతర సంస్థలలో క్యాంటీన్లను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారన్నారు. పరిసరాల శుభ్రత, రుచికరమైన, నాణ్యత కలిగిన ఆహారపదార్థాలు వినియోగదారులకు అందించేలా చూసుకోవాలన్నారు. అంతకుముందు నిథమ్ ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంకెగణేష్, సెర్ప్ డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ పర్యవేక్షణలో చెఫ్‌లు మహేష్, తుల్జారామ్, సెర్ప్‌డీపీఎం హమీద్, నిథమ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లి జే ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలను తయారు చేసి వారికి చూపించారు. అనంతరం వంటలో మెళకువలను నేర్పించారు. నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 50, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 40, క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి 400.

నేడు మహా పడిపూజ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌కాలనీలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప స్వామి మహా పడిపూజ జరగనుంది. గుడివాడ బ్రదర్స్‌చే భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులు పూజలో పాల్గొనాలని కొలన్ శ్రీనివాస్ రెడ్డి కోరారు.

ఖాజాగూడలో కార్పొరేటర్ బస్తీబాట



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం ఖాజాగూడలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నామన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు అవసరమైన చోట్ల చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్‌రెడ్డి, ఏఈ రషీద్, ఎలక్ట్రికల్ ఏఈ లిఖిత, నాయకులు అరుణ్‌గౌడ్, తిరుపతి, కృష్ణాయాదవ్, సంజీవ, నిర్మల వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, పవన్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



శేరిలింగంపల్లిలో ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో శనివారం జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. పాత ముంబై జాతీయ రహదారిపై హెచ్‌సీయూ డిపో నుంచి గుల్‌మొహర్ పార్కు కాలనీ వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలను కొనసాగించడంతో పాదచారులు, వాహనదారులకు అసౌకర్యంగా మారింది. దీంతో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాలతో ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్‌లో రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి కమిటీ హాల్ కాలనీ ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టి గౌడ్, ధనుంజయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధి రాంనరేష్ నగర్‌లో రోడ్డు పనులు పూర్తయిన సందర్భంగా కాలనీవాసులు శనివారం ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అసంపూర్తి రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోతుల రాజేందర్, చాట్ల రవి, వెంకటేష్‌యాదవ్, సత్యనారాయణ, మహేందర్ రెడ్డి, కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో అంకితభావ దినోత్సవం

చందానగర్: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనావాహిని వార్షికోత్సవంను పురస్కరించుకొని అన్నమయ్యపురంలో అంకిత భావ దినోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వరార్చనలో భాగంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శోభారాజు శిష్య బృందం ధన్యోస్మి 'గణరాజు, గుణరాజు' అంటూ తొలుత గణపతిని ఆరాధించారు. కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు, చాలదా హరి నామం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వ్యాఖ్యానం అందించారు. కార్యక్రమంలో అతిథులుగా శంకరాభరణం ఫేమ్ మంజుభార్గవి, సిటాడెల్ దర్శకులు, ది ఫేమిలీ మెన్ ఫేమ్ రాజ్ నిడిమోరు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం ప్రసాద వితరణ చేశారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

ఆల్విన్‌కాలనీ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్ నగర్ ఫేజ్ 2 కాలనీలో సొంత ఖర్చులతో వేయిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను అధికారులు, కాలనీవాసులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



మంజూరు పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. శనివారం శేరిలింగంపల్లి డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన సాయి కార్తీక్ చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.లక్ష మంజూరుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, ప్రసాద్, రాజేందర్, సత్యనారాయణ, వెంకటేష్ యాదవ్, రవి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్లలో..

నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వి. జగదీశ్వర్‌గౌడ్ బాధితులకు అందజేశారు. కూకట్‌పల్లి డివిజన్ ప్రగతినగర్‌కు చెందిన బూటన్‌దేవీకి రూ. 60 వేలు, చందానగర్ డివిజన్ పీఏనగర్‌కు చెందిన మునిశేఖర్‌కు రూ.60 వేలు, ఆనంద్‌కుమార్‌కు రూ.60 వేలు, హఫీజ్‌పేట్ డివిజన్ గంగారం యాదమ్మకు రూ.52,500, వివేకానందనగర్‌కు చెందిన శంకర్‌కు రూ.57,500 చొప్పున మంజూరుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ఛైర్మన్ నల్ల సంజీవరెడ్డి, నియోజకవర్గ నాయకులు కల్వనా ఏకాంత్ గౌడ్, యాదగిరి, రవికుమార్, ఆయాజ్ ఖాన్, విష్ణు, పరుశురాం, సురేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

శ్రీ చైతన్య లెక్చరర్‌పై మియపూర్ పీఎస్‌లో విద్యార్థినులు, తల్లిదండ్రుల ఫిర్యాదు



కెమిస్ట్రీ లెక్చరర్ హరీష్



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు

మియాపూర్: విద్యాబుద్ధులు నేర్పాల్సిన లెక్చరర్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా మేసేజీలు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదీనాగూడ శ్రీ చైతన్య కళాశాలలో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీ చైతన్య కళాశాలలో కందుకూరి హరీష్ కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా కళాశాలలో విద్యార్థినులను తరగతి గదిలోకి ఒంటరిగా పిలిచి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వారి నుండి ఫోన్ నంబర్లు తీసుకుని వాట్సప్, ఇన్‌స్టాగామ్‌లలో మేసేజ్‌లు చేస్తున్నాడు. బయటకు చెబితే అంతుచూస్తానని బెదిరించాడు. దీనిపై యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి వారు కళాశాల ముందు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మియాపూర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని బాధిత విద్యార్థులతో మాట్లాడారు. కెమిస్ట్రీ లెక్చరర్ హరీష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. లెక్చరర్ హరీష్ పరారీలో ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కార్తీక్ (ఫైల్)

మియాపూర్: హఠాత్తుగా డీసీఎం వాహనం బ్రేక్ వేయడంతో వెనుక నుండి ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కుల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన కోటా మధుసూదన్, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు కోటా కార్తీక్(20) కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ అవినాష్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో కోటా కార్తీక్ శనివారం తెల్లవారుజామున స్నేహితుడైన రాంచందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లి నుండి పటాన్‌చెరు వెళ్తుండగా మార్గమధ్యంలో మియాపూర్ మెట్రో పిల్లర్ 606 వద్దకు రాగా పాల డీసీఎం డ్రైవర్ బస్వరాజ్ ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న ద్విచక్ర వాహనం డీసీఎంను ఢీకొంది. దీంతో కార్తీక్, రాంచందర్‌లు కిందపడ్డారు. తీవ్రగాయాలవడంతో స్థానికులు దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించగా కార్తీక్‌ను పరిశీలించిన డాక్టర్లు కార్తీక్ బ్రెయిన్ డెడ్ అయిందని చెప్పారు. రాంచందర్ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కార్తీక్ తండ్రి కోటా మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎయిడ్స్ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న గురుప్రకాష్

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని లేపాక్షి జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటి పారా మెడికల్ అధికారి జి.గురుప్రకాష్, తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం అని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియషన్ సభ్యులు జనార్దన్, అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: సకాలంలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కార్పొరేటర్ పర్యటించారు. పాత మార్కెట్ నుండి గౌతంనగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం శాంతినగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న మహా అన్నదాన కార్యక్రమం నేపథ్యంలో పరిసరాలను శుభ్రం చేయించారు.

యూనిఫామ్‌లు పంపిణీ

చందానగర్: చందానగర్ పరిధి గంగారంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్ యూనిఫామ్, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్, విజయలక్ష్మి, ప్రీతి, కృష్ణవేణి, సంజీవ్‌కుమార్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రవి కిరణ్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రవి కిరణ్‌గౌడ్ అన్నారు.భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ.... రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజులుగా రోజుకో పాఠశాలలో, హాస్టల్‌లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రి పాలవుతున్నారని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వంతగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రం సమీపంలోని రంగరాములగుట్టపై శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. రామాలయ అర్చకుడు లక్ష్మణాచార్యులు పూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రంగరాముని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సందడిగా 'ఉద్వేగ'

సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



ఎంబీఏ విద్యార్థుల ఆటాపాట

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ఉద్వేగ పేరిట ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి సుధీర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి రవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల నృత్యాలు అదుర్స్ అనిపించాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ ప్రొ.రవి మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్నిరకాల పోటీలను ఎదుర్కొనేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఎంబీఏ విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బచ్పన్ అండ్ అకడమిక్ హైట్స్‌లో స్పోర్ట్స్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులను ప్రోత్సహించాలి

గచ్చిబౌలి: మసీదుబండలోని బచ్పన్ అండ్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ఆపరేషనల్ డైరెక్టర్ శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ శ్రీవిద్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు ఇతర రంగాలలోనూ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తే రాణిస్తారన్నారు. అనంతరం విద్యార్థులు క్రీడా పోటీలలో తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో స్కూల్ సెంటర్ హెడ్ సోహని , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం





స్వామివారి కల్యాణం.. వీక్షిస్తున్న భక్తులు

మియాపూర్: మియాపూర్ మయూరినగర్‌లోని శ్రీ కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి, ధ్యాన మారుతీ మందిరంలో కార్తీక పూజలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా జరిపించారు. చుట్టుపక్కల కాలనీలవాసులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఎంతో అవసరం

మెరిడియన్ స్కూల్ సీఈఓ తేజస్విని బుట్టా



విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పిస్తున్న యూనివర్సిటీల ప్రతినిధులు

చందానగర్: ఉన్నత విద్యపై విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఎంతో అవసరమని సీఈఓ తేజస్విని బుట్టా పేర్కొన్నారు. శనివారం మాదాపూర్ మెరిడియన్ స్కూల్‌లో మెగా కెరీర్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫెయిర్‌లో యూఎస్, యూకే, ఐర్లాండ్ దేశాలలో ప్రముఖ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆయా యూనివర్సిటీల్లో కోర్సులు, వసతులు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. సుమారు 75కు పైగా యూనివర్సిటీల ప్రతినిధులు ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.భవాని, విద్యా సంస్థల ప్రెసిడెంట్ లలితానాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



మణికొండ: ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నిబంధనలు మన జీవనానికేనని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించినపుడే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుతామని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. శనివారం మణికొండలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయ ఆనంద్‌తో కలిసి ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ... ఒక్క క్షణం త్వరగా వెళ్దామని ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంగించి విలువైన ప్రాణాలను పోగొట్టుకున్న వారు ఎంతో మంది ఉన్నారన్నారు. రోడ్డుపై ప్రతి ఒక్కరూ ఎడమ వైపునే ప్రయాణించాలని, ద్విచక్రవాహన దారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ఉన్న వారు సీటు బెల్టులను పెట్టుకోవాలని, సిగ్నల్‌లను పాటించాలని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని, అలా చేస్తే జరిగే పరిణామాలను లఘు చిత్రాలను చూయించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరి, ప్రిన్సిపాల్ అనిత, ఆర్ఐ అనిత, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, నాసా ఇంచార్జి ఉమా, సీ ల్యాబ్ ఇంచార్జి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య, సాహిత్యం.. మా లక్ష్యం

టీచ్ ఫర్ ఛేంజ్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు లక్ష్మీ మంచు



పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

చందానగర్: విద్యార్థులకు విద్యను, సాహిత్యాన్ని అందించడానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నామని టీచ్ ఫర్ ఛేంజ్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు లక్ష్మీ మంచు పేర్కొన్నారు.టీచ్ ఫర్ ఛేంజ్ సామాజిక సేవా సంస్థ శనివారం మాదాపూర్‌లోని పెగా సిస్టమ్స్ కార్యాలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పెగా సిస్టమ్స్ ఉపాధ్యక్షులు, సీఎస్ఆర్ కమిటీ సభ్యులు దీపక్ విశ్వేశ్వరయ్య, సినీ నటి మంచు లక్ష్మి, సర్వశిక్ష అభ్యాస్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధారెడ్డిలు హాజరై మాట్లాడారు. స్థానిక విద్యావేత్తలు, వాలంటీర్లు, భాగస్వాములతో కలిసి పెగా టీచ్ ఫర్ ఛేంజ్ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను రూపొందిస్తుందన్నారు. పిల్లలకు తరగతి గదులతో బాటు ఇంట్లో కూడా అభ్యాసం ఎంత ముఖ్యమో తెలియజేసిందన్నారు. 3 రాష్ట్రాలలోని సుమారు 53,780 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఒకచోట చేర్చి ప్రతిభ, సాహిత్య పండుగను నిర్వహించారన్నారు. 200 మంది ఫైనలిస్టులతో గ్రాండ్ ఫినాలే నిర్వహించారు. విజేతలకు ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు బహుమతిగా అందించారు. పెగా సిస్టమ్స్, పెగా టీచ్ ఫర్ ఛేంజ్ ప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.